క్లుప్తంగా

ఆధార్ కేంద్రాలను పెంచాలి

మణుగూరురూరల్: ఆధార్ అప్డేట్ కోసం ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని జిల్లా అధికారులు, ప్రభుత్వం ఆధార్ కేంద్రాలను మండలాల వారీగా పెంచాలని సీపీఐ పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ కోరారు. సోమవారం సీపీఐ నాయకుల బృందం ఆధార్ కేంద్రాలను సందర్శించి ప్రజలు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దుర్గ్యాల సుధాకర్ మాట్లాడుతూ.. ఆధార్ కార్డ్ అప్‌డేట్ కోసం ఎంతోమంది ప్రజలు సుదూర ప్రాంతాల నుంచి మణుగూరు ఆధార్ కేంద్రానికి రావాల్సి వస్తోందని, గంటల తరబడి నిలబడి క్యూలైన్ లో వేచి ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లులు తమ పిల్లలతో ఆధార్ కేంద్రం వద్ద పడిగాపులు కాయాల్సివస్తుందన్నారు. జిల్లా కలెక్టర్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆధార్ కేంద్రాల పెంపుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు ఎస్‌కె.సర్వర్, మంగి వీరయ్య పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

చర్ల: మండల టీఎస్ యూటీఎఫ్ నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కాకా రాంబాబు, ఉయిక బాలకృష్ణనలను ఎంపిక కాగా.. ఉపాధ్యక్షుడిగా కె.యాదగిరి, పి.రాధ కోశాధికారిగా సకినం బాలకృష్ణ, కార్యదర్శులుగా కృష్ణవేణి, హిమగిరిబాబు, రాంబాబు, పంతులు, రుక్మిణి ఆడిటర్‌గా సర్వేశ్వరావు, మహిళా కమిటీ కన్వీనర్‌గా వాణిశ్రీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.కృష్ణ జిల్లా ఉపాధ్యక్షుడు మురళీమోహన్, కార్యదర్శి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

భద్రాచలంఅర్బన్: గిరిజన సంక్షేమ విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు బుటారి రాజు, రాష్ట్ర కౌన్సిలర్ భట్టా ప్రసాదరావు ఉపాధ్యాయ దర్శిని సంపాదకవర్గ సభ్యుడు మునిగడప రామాచారిలు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం స్థానిక టీపీటీఎఫ్ కార్యాలయంలో భద్రాచలం డివిజన్ లోని 8 మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, జోనల్ బాధ్యుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. అన్ని శాఖలు సమీక్షించినట్లు గానే గిరిజన సంక్షేమ విద్యాశాఖను కూడా సమీక్షించి అభివృద్ధికరమైన మార్పులను చేపట్టాలని నూతన ముఖ్యమంత్రిని కోరారు. కార్యక్రమంలో బి.రాజు, బి.ప్రసాదరావు, ఎం. రామాచారి, టి.సత్తిబాబు, పి.గంగరాజు, ఎస్.కృష్ణ బాబు, బి.రవి, బి.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్ ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడంతో ఆటోడ్రైవర్ల జీవనం దుర్భరంగా మారిందని, ఆటోడ్రైవర్లకు ప్రభుత్వం న్యాయం చేయాలని ఇఫ్టూ నాయకులు సాధనపల్లి రవి కోరారు. సోమవారం సురక్షా బస్టాండ్ అడ్డాలో జరిగిన ఆటోడ్రైవర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వం మహాలక్ష్మి పథకం వల్ల ఆటోలో ప్రయాణించే వారి సంఖ్య తగ్గిందని, తద్వారా ఆటోలు సరిగా నడవక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్ల పరిస్థితిని అర్థం చేసుకుని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు నాగేశ్వరరావు, శ్రీను, చారి, సాంబ, సూర్యనారాయణ, రాములు, రషీద్, భద్రం, ప్రసాద్ పాల్గొన్నారు.

సీపీఐ నాయకుల సంతాపం

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీకి చెందిన సీపీఐ సీనియర్ కార్యవర్గ వేర్పుల నతానియేలు అనారోగ్యంతో ఆదివారం మరణించగా.. విషయం తెలుసుకున్న సీపీఐ మండల, పట్టణ కార్యదర్శులు జంగం మోహన్‌రావు, సుధాకర్, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీ కుమారి, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.లక్ష్మీనారాయణలు సోమవారం వారి నివాసానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించారు. పూలమాల వేసి ఎర్రజెండా కప్పి ఘన నివాళ్లు అర్పించారు. నతానియేలు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ.. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో పార్టీ జిల్లా సమితి సభ్యులు ఎస్‌కె సర్వర్, మంగి వీరయ్య, జగ్గన్న, ప్రమీల తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్‌ను నియంత్రించాలి

మణుగూరురూరల్: పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని బీఆర్ఎస్ పార్టీ యూత్ నాయకులు, న్యాయవాది రుద్ర వెంకట్ సోమవారం మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రుద్ర వెంకట్ మాట్లాడుతూ.. మణుగూరులో సింగరేణి, బీటీపీఎస్ వంటి పరిశ్రమలు ఉండడం, ఇతర వాహనాల రాకపోకలు రద్దీ పెరగడంతోందని, తద్వారా ట్రాఫిక్ సమస్య తీవ్రతరమవుతోందన్నారు. ప్రజల ఇబ్బందుల దృష్ట్య పట్టణ, పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నలింగ్ ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఆయన డీఎస్పీని కోరారు. ఈ కార్యక్రమంలో సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో కోతుల బెడద

- ఇళ్లలోకి దూరి బీభత్సం
- అడ్డుకునేవారిపై దాడి
- పట్టింపులేని పాలకవర్గం



ఓ ఇంటి దాబాపై కూర్చొని ఇలా..



ఇళ్లు- కరెంట్ తీగల మధ్య గంతులేస్తున్న కోతులు

దుమ్ముగూడెం: మండల ప్రధాన గ్రామం అయిన లక్ష్మీనగరంలో కోతుల బెడద తీవ్రమైంది. తరచూ ఇళ్లలోకి చొరబడి ఇంట్లో సామాన్లు చిందరవందర చేస్తూ వృద్ధులు, పిల్లలపై దాడులు చేస్తున్నాయి. ప్రధానంగా వంటింట్లోకి దూరి బీభత్సం సృష్టిస్తున్నాయి.మనుషుల్లాగా తలుపులు తట్టి మరీ లోపలికి చొచ్చుకు వస్తున్నాయి. దీంతో గ్రామ ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వానరాల నివారణ చర్యలపై పంచాయతీ అధికారులు కనీసం స్పందించడం లేదని స్థానికులు వాపోతున్నారు.

కోతులను బెదిరించే ప్రయత్నం చేస్తే మీదపడి కరుస్తున్నాయి. ఇంటి ముందు పూల కుండీలను ధ్వంసం చేస్తున్నాయి. మొక్కలు పీకేస్తున్నాయి. కోతుల బెడదకు కొందరు ఇంటికి జాలి కట్టి రక్షణ చర్యలు తీసుకుంటున్నారు.అలాగే గ్రామంలోని పళ్ల దుకాణాల్లోకి, కూరగాయాల దుకాణాల్లోకి దూరి పండ్లు, కూరగాయాలు చేతికి ఏది అందితే అది పట్టుకుని పోతున్నాయి. వాటిని బెదిరించాలని చూస్తే అవి మీదికి దూకి గాయపరుస్తున్నాయి ఒంటరిగా ఉండే వారిపై దాడికి సైతం ప్రయత్నిస్తున్నాయి. పంచాయతీ అధికారులు స్పందించి కోతుల బెడద నివారణకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటారా?

అటవీప్రాంతంలో వాటికి ఆహారం దొరకకపోవడంతో గ్రామాల్లోకి వస్తున్నాయి. గతంలో ఇలాగే గ్రామంలో కోతులు భీభత్సం సృష్టించడంతో కోతులను పట్టేవారిని పంచాయతీ అధికారులు పిలిపించి ఒక్కో కోతికి కొంత డబ్బును చెల్లించి కోతులను పట్టించి అటవీప్రాంతంలో వదిలేశారు. ఆ సమయంలో కొన్ని కోతులు బయపడి పారిపోయాయి. అవి ఇప్పుడు మళ్ళీ గ్రామంలోకి ప్రవేశించి వాటి సంతతి పెంచుకుని రణరంగం సృష్టిస్తున్నాయి. మరోసారి పంచాయతీ అధికారులు కోతులు పట్టే ప్రత్యేక బృందాలను పిలిపించి వాటిని పట్టించాలని గ్రామస్తులు కోరుతున్నారు. అనూ వాటిరి అటవీప్రాంతంలో గ్రామానికి దూరంగా వదిలివేయాలని విన్నవిస్తున్నారు.

తోటలను ధ్వంసం చేస్తున్నాయి..



కోతులు కూరగాయల తోటలను ధ్వంసం చేస్తున్నాయి. తోట మీద దాడి చేసి నష్టపరుస్తున్నాయి ఎన్ని రక్షణ చర్యలు తీసుకున్నా వాటి దాడి ఆగడం లేదు. పంచాయతీ అధికారులు కోతులను కట్టడి చేసేలా చర్యలు చేపట్టాలి.

– అయ్యపురెడ్డి శ్రీధర్, కూరగాయల తోట యజమాని, బుర్రవేముల

ఇబ్బంది పడుతున్నాం..



కోతులు పండ్ల దుకాణంపై దాడి చేసి పళ్లని ఎత్తుకుని పోతున్నాయి ఉదయం నుండి సాయంత్రం వరకు వాటిని తరేమేందుకు కర్ర పట్టుకుని ఉండాల్సి వస్తుంది ఒక్క క్షణం అలా వెళ్తే వెంటనే దుకాణంలో దూరి పళ్లను ఎత్తుకునిపోతున్నాయి. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

– అనుముల కృష్ణారెడ్డి, పండ్ల దుకాణం వ్యాపారి

గిరిజనేతరుల సమస్యలు పరిష్కరించాలి



కరకగూడెం: సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కరకగూడెం: ఏజెన్సీ పరిధిలోని గిరిజనేతరుల సమస్యలను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే పరిష్కరించాలని మండల అడహక్ కమిటీ అధ్యక్షుడు కొంపెల్లి పెద్దరామలింగం కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం మండలంలోని రాళ్ళవాగు వద్ద సంఘం నాయకులతో సమావేశం నిర్వహించి గిరిజనేతరులు న్యాయమైన హక్కులు, సమస్యలపైచర్చించారు. సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలో ఎళ్ళ తరబడి నివసిస్తున్న గిరిజనేతరులపై ప్రభుత్వాలు వివక్ష చూపుతున్నాయని తద్వారా ఉద్యోగ, ఉపాధి, భూములపై భరోసా లేక వారు మానసిక శోభను అనుభవిస్తున్నారని తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు.అంతేకాకుండా సుమారు 80 సంవత్సరాల నుంచి గిరిజనేతరుల స్వాధీనంలో ఉన్నటువంటి ప్రభుత్వ భూములపై,పోడు భూములపై గాని ఎలాంటి భద్రత లేకుండా జీవిస్తున్నారని, ఆ భూములపై రుణ సౌకర్యం గాని, రైతు బంధు, రైతు భీమా వంటి ప్రభుత్వ పథకాలు కూడా అందక దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారని విచారం వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరులు నూతనంగా కనీసం ఇల్లు కట్టుకోవాలన్న,భూములు అమ్ముకోవాలన్న, కొనాలన్న అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఇకనైన గిరిజనేతరుల సమస్యలపై ప్రభుత్వాలు దృష్టిసారించాలని విజ్ఞప్తి చేసారు. ఈ సమావేశంలో గిరిజనేతర నాయకులు గంగనపల్లి నాగేశ్వరరావు, అక్కిరెడ్డి సంజీవరెడ్డి, శివరాత్రి మధు, వంగరి సతీష్, ఇల్లెందుల సురేష్, కొమ్మ కృష్ణ, గుడ్ల రంజిత్, వెంకటేశ్వర్లు, శేషగిరిబాబు, మల్లారెడ్డి, లింగయ్య, సతీష్ పాల్గొన్నారు.

నేడు 'కల్యాణలక్ష్మి' పంపిణీ

మణుగూరురూరల్: పట్టణంలోని మణుగూరు తహసీల్దార్ కార్యాలయంలో పినపాక నియోజకవర్గ శాసనసభ్యుడు పాయం వెంకటేశ్వర్లు చేతుల మీదుగా లబ్ధిదారులకు నేడు మంగళవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్న తహసీల్దార్ రాఘవరెడ్డి సోమవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు.

రేపు దివ్యాంగులకు బస్ పాస్‌లు

దుమ్ముగూడెం: మండల పరిషత్ కార్యాలయంలో దివ్యాంగులకు రేపు (బుధవారం) బస్ పాసుల జారీ మేళా నిర్వహించనున్నట్లు దుమ్ముగూడెం ఎంపీడీఓ ముత్యాలరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని సదరం సర్టిఫికెటులో లోకో మోటర్ లేదా ఆర్థో 40 శాతం మించి ఉండాలని, వినికిడి, దృష్టిలోపం ఉన్నవారికి 100 శాతం ఉండాలని, మెంటల్ రిటార్డేషన్ ఉన్న వారి ఐక్యూ 69 శాతం కంటే తక్కువ ఉండాలని తెలిపారు. దివ్యాంగులు ఒక పాస్ పోర్ట్ సైజ్ ఫొటో, సదరం సర్టిఫికెట్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, ఐడీ కార్డ్ సర్వీస్ చార్జ్ కోసం రూ.50లు తీసుకుని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించే దివ్యాంగుల బస్ పాస్ స్పెషల్ క్యాంప్ మేళాలో పీహెచ్‌సీ బస్ పాసులను పొందాలని పేర్కొన్నారు.

చర్యలు తీసుకోవాలి

బూర్గంపాడు: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో సమయ పాలన పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ డివిజన్ నాయకులు డి.పున్నంచంద్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రధాన అధికారులతో పాటుగా సిబ్బంది కూడా విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. అలాంటి వారికి గుర్తించి చర్యలు చేపట్టాలని కోరారు.

కార్మిక పక్షపాతి టీబీజీకేఎస్

మణుగూరురూరల్: ఈ నెల 27న జరిగే సింగరేణి గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికల్లో కార్మికుల పక్షపాతి అయిన టిబిజికెఎస్‌ను బాణం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆ యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వి.ప్రభాకర్‌రావు కార్మికులను కోరారు. సోమవారం మణుగూరు ఏరియాలోని మణుగూరు ఓసీలో జరిగిన మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో యూనియన్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో కార్మికులకు అవసరమైన హక్కులను సాధించడమే కాకుండా పలు సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. వారసత్వ ఉద్యోగాలు ఇవ్వొద్దని సుప్రీం కోర్ట్ తేల్చి చెప్పినా కూడా ఆనాడు సీఎం కేసీఆర్ అవేమి పట్టించుకోకుండా కారుణ్య నియామకాల పేరుతో కార్మికుల పిల్లలకు ఉద్యోగ అవకాశం కల్పించారన్నారు. కారుణ్య నియామకం కింద ప్రస్తుతం 19,463 మంది పని చేస్తున్నారని, ఇదంతా సీఎం కేసీఆర్ వల్లే సాధ్యమైందన్నారు. అలాగే ఇంక్రిమెంట్, రూ.10లక్షల వడ్డీ లేని రుణం, ఉచిత కరెంట్, ఉచిత ఏసి సౌకర్యం వంటి కార్యక్రమాలు బీఆర్ఎస్, అనుబంధ టిబిజికెస్ వల్లే సాధ్యమయ్యాయన్నారు. కార్మిక సంక్షేమం కోసం నిరంతరం పాటుపడిన టీబీజీకేఎస్‌ను జరగబోయే ఎన్నికల్లో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంఘంనాయకులు అబ్దుల్ రవూఫ్, వీరభద్రయ్య, ఎస్‌పీఎస్ఎన్ వర్మ, మునిగెల రమేష్, ఇంతియాజ్ పాషా, సాగర్, బిక్కసాని రవి, సుధాకర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం



అండర్-14 వాలీబాల్‌లో రన్నర్‌గా నిలిచిన అనగశ్రీని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అశ్వాపురం: మండలంలోని మల్లెలమడుగులో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న విద్యార్థిని అనగశ్రీ ఉమ్మడి ఖమ్మం జిల్లా తరుపున మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన అండర్ 14 వాలీబాల్ విభాగంలో ఆడి ప్రతిభ కనబర్చడంతో సోమవారం ఆ విద్యార్థినిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంలో మొండికుంటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎంపీటీసీ సభ్యులు కమటం నరేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో విద్యార్థిని షాలువతో సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి తల్లిదండ్రులతో పాటు పాఠశాలకు, మండలానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పరశురామావతారంలో పర్ణశాల రాముడు



పరశురామావతారంలో రామయ్య..

దుమ్ముగూడెం: పర్ణశాల సీతారామచంద్రస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలలో భాగంగా 6వ రోజు సోమవారం పర్ణశాల రామయ్యను పరశురామావతారంలో అలయ అర్చకులు శేషం కిరణ్‌కుమారాచార్యులు, భరద్వాజచార్యులు, అమరవాది కిషోర్‌కుమారాచార్యులు, నరసింహచార్యులు అలంకరించారు.ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలను, అభిషేకాలను నిర్వహించిన అర్చకులు అనంతరం స్వామి వారిని పరశురామావతారంలో అలంకరించారు. శుక్రగ్రహ బాధలున్నవారు ఈ అవతారాన్ని దర్శించడం వలన శుభ పలితాలను పొందుతారని అర్చకులు వివరించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నిజామాబాద్‌కు చెందిన ఎస్.చిరంజీవాచార్యులు ఆధ్వర్యంలో ద్రౌపది స్వయంవరం హరికథను అలపించారు. నేడు శ్రీరామావతారంలో దర్శనం ఇవ్వనున్న స్వామివారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ శ్రావణ్‌కుమార్, అనిల్‌కుమార్, సూపరింటెండెంట్ కిషోర, ఆలయ ఇన్‌చార్జ్ ప్రసాద్, సిబ్బంది శివ, రాము తదితరులు పాల్గొన్నారు.

పాలనలో శభాష్ అనిపించుకుంటా..



సీతాయిగూడెంలోని వెంగళరాయసాగర్ గండిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

చంద్రుగొండ: ఎమ్మెల్యేను అయినప్పటికీ ప్రజల్లో ఒకడిగా ఉంటూ ఐదేళ్లపాలనతో ప్రజలతో శభాష్ అనిపించుకుంటానని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం తొలిసారిగా సోమవారం ఆయన మండలంలో ధన్యవాద పర్యటన చేపట్టారు. సీతాయిగూడెం నుండి ప్రారంభమైన ఎమ్మెల్యే పర్యటన మహ్మద్‌నగర్, తిప్పనపల్లి, రేపల్లెవాడ, తుంగారం, టీకలబంజర్, సుంకరబంజర్ వరకు సాగింది. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి ప్రజలకు కృతజ్ఞతలు తెలిపేందుకు వెళ్తానన్నారు. ఈ గెలుపు కాంగ్రెస్ పార్టీదేనన్నారు. స్వార్థ రాజకీయాలు చేయకుండా ప్రతి ఒక అర్హులైన కుటుంబాలకు ఆరు గ్యారంటీ పథకాలను అందేలా పనిచేస్తానన్నారు. నియోజకవర్గంలోని అనేకమంది నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌పార్టీలో చేరేందుకు ముందుకు వస్తున్నారని అయితే ఇప్పట్లో ఎలాంటి చేరికలు ఉండబోవని, పార్టీ గెలుపు కోసం అహర్నిషలు కృషి చేసిన కార్యకర్తలు అధికారాన్ని ఆస్వాదించాలన్నారు.

మరమ్మతులకు నిధులు తెస్తా..

మండలంలో ప్రధాన సాగునీటి వనరైన సీతాయిగూడెంలోని వెంగళరాయసాగర్ మరమ్మతుల కోసం ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువస్తానని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ రైతులకు హామీ ఇచ్చారు. రైతుల కోరిక మేరకు ఆయన ప్రాజెక్ట్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రాజెక్ట్ అలుగుకు గండిపడి నాలుగేళ్లు అయిందని దీంతో ప్రాజెక్ట్‌లో నీళ్ళు నిల్వ ఉండటం లేదని ఆయకట్టు రైతులు వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని రైతుల ఆవేదన వ్యక్తం చేశారు. త్వరితగతిన నిధులు మంజూరు చేయించి అభివృద్ధి చేయిస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు భోజ్యానాయక్, సారేపల్లి శేఖర్, కృష్ణారెడ్డి, నల్లమోతు రమణ, ఉప్పతల ఏడుకొండలు, ఎస్డీ సైదా, డి.రామారావు, మచ్చా కుమార్, అజ్గర్ వివిధ పంచాయతీలకు చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వెంకన్నకు నివాళి..

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని పెంట్లం గ్రామానికి చెందిన తుమ్మల వెంకన్న (48) గుండెపోటుతో మృతి చెందగా.. స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సోమవారం పెంట్లంలోని మృతుడి ఇంటికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు పర్సా వెంకటేశ్వర్లు, బానావత్ భీముడు, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ పీఓ దృష్టికి మండల సమస్యలు



ఐటీడీఏ పీఓకు సమస్యలను వివరిస్తున్న ఎంపీపీ మంజు భార్గవి

గుండాల: ఆళ్లపల్లి మండలంలో పలు సమస్యలతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని, వాటిని పరిష్కరించాలని ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్‌కు ఐటీడీఏలో వినతిపత్రం అందించారు. మండలంలోని అన్ని గిరిజన ప్రాథమిక పాఠశాలలో డ్యూయల్ డెస్కులు ఏర్పాటు చేయాలని, మరుగుదొడ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఆయా పాఠశాలలో మంచినీటి సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. నడిమిగూడి గ్రామం చీమలగుంపులో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. ముత్తాపురం గ్రామంలో సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మించాలని, రాయిగూడెం గ్రామానికి రోడ్డు సౌకర్యంచ, ఊరవాగుపై బ్రిడ్జీ నిర్మించాలని తెలిపారు. మండలంలో స్కిల్ డౌలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజన గ్రామాల్లో పోడు రైతులకు గిరివికాసం సౌకర్యం కోసం అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని పీఓ తెలిపినట్లు పేర్కొన్నారు.

మంత్రులను కలిసిన నాయకులు



మంత్రి సీతక్కకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

అశ్వాపురం: అశ్వాపురం ఎంపీపీ ముత్తునేని సుజాత సోమవారం పాలేరు శాసన సభ్యులు, తెలంగాణా రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబందాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఖమ్మంలో కలిసి శుబాకాంక్షలు తెలిపారు. మంత్రి శ్రీనివాసరెడ్డిని కలిసి ఎంపీపీ సుజాత, కాంగ్రెస్ నాయకులు ముత్తునేని శ్రీనివాసరావు, వేములపల్లి రమేష్ తదితరులు మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. అశ్వాపురం మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మంత్రిని వారు కోరారు.

సీతక్కను కాంగ్రెస్ నాయకులు

అశ్వాపురం: మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ములుగు శాసన సభ్యురాలు, తెలంగాణా రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ మరియు పంచయితీ రాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క)ను ములుగులో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్కకు పుష్ప గుచ్చాలను అందజేసిన కాంగ్రెస్ నాయకులు అశ్వాపురం మండల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. మంత్రి సీతక్కను కలిసిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి బిక్షమయ్య, కేశవరెడ్డి తదితరులు ఉన్నారు.


కమిషనర్‌ను కలిసిన రోశిరెడ్డి



పంచాయతీరాజ్ కమిషనర్ హనుమంతరావుకు పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న రోశిరెడ్డి

భద్రాచలంఅర్బన్: తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ హనుమంతరావుని సోమవారం హైదరాబాద్‌లో తన ప్రభుత్వ కార్యాలయంలో భద్రాచలం దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యుడు రోశిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిపి పుష్పగుచ్చాన్ని అందించారు. అనంతరం ముక్కోటి ఉత్తర ద్వాదర్శనానికి భద్రాచలం వచ్చి రాముల వారిని దర్శించుకోవాలని అదే విధంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం, సారపాక గ్రామ పంచాయతీలకు ప్రత్యేక నిధులు కేటాయించి వాటి అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ హనుమంతరావుని కోరినట్లుగా రోశిరెడ్డి తెలిపారు.

వైభవంగా సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం



దమ్మపేట: స్వామి వారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



భద్రాచలంఅర్బన్: స్వామి వారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

దమ్మపేట: మండల కేంద్రంలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. సోమవారం సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా వేకువజాము నుంచే వందలాదిగా భక్తులు సుబ్రహ్మణ్య స్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సుబ్రహ్మణ్య షష్ఠిని పురస్కరించుకొని ఆలయంలో స్వామి వారి కల్యాణాన్ని వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారి దర్శనానికి విచ్చేసి, కల్యాణాన్ని తిలకించిన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని జూనియర్ కళాశాల సెంటర్‌లో శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్య స్వామి వారి కల్యాణాన్ని సోమవారం సంబంధిత ఆలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం గం.5.00లకు స్వామి వారికి పంచామృతాలతో రుద్రాభిషేకం చేశారు. అనంతరం మహిళ భక్తులతో నాగ దేవతకు ఆలయ పూజారి భైరవభట్ల వెంకట రత్నం కుంకుమ పూజ నిర్వహించారు. భక్తులకు అమ్మవారి పసుపు కుంకుమ, గాజులు, జాకెట్ ముక్కలను అందించారు. సాయంత్రం శ్రీవల్లీ దేవసేన సుబ్రహ్మణ్య స్వామి వారి కల్యానాన్ని కనుల పండువగా నిర్వహించినారు. స్వామి కల్యాణ నిర్వహణకు లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల అధినేత, దివంగత మాగంటి సూర్యం కుమారులు ప్రసాద్ బాబు, రమేష్ బాబులు సహకారం అందించారు. కల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తరించారు. స్వామి వారి ఆశీస్సులతోపాటు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని నామవరం గ్రామంలో కొలువుదీరిన శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. సోమవారం సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి పర్వదినం పురష్కరించుకొని ఆలయంలో శ్రీస్వామి వారికి అభిషేకాలు, అర్చనలు తదితర పూజా కార్యక్రమాలను జరిపించారు. అర్చకులు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా స్వామి వారి కల్యాణం జరిపించారు. స్వామి వారి కల్యాణం తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆలయంలో పూజలు చేసి,కల్యాణం తిలకించారు. స్వామి వారి కల్యాణం అనంతరం భక్తులకు ఆలయంలో అన్నప్రసాదాలను అందజేశారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు..

మండల కేంద్రంలోని భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి వారి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అన్నపూర్ణ, సర్పంచ్ బోడా పద్మ, పంచాయతీ కార్యదర్శులు ఖాదర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.